క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం (విశాఖ జిల్లా కమిటీ) ప్రధన కార్యదర్శి బొట్ట వెంకటప్పారావు యాదవ్, జాయింట్ సెక్రటరీ నమ్మి శంకర్‌యాదవ్,ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లా సాగర్‌యాదవ్ ఆధ్వర్యంలో కార్డియాక్ డయాగ్నస్టిక్ సహకారంతో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తారు. బీపీ, ఈసీజీ, బి.ఎం.ఐ,గుండె వేగం,రక్తపోటు (షుగర్),ఆర్.బి.ఎస్ తదితర వైద్య పరీక్షలతో పాటు వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు అందిస్తారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

మహిళలు ఆదర్శంగా నిలవాలి

మల్కాపురం: మహిళలు వంట ఇంటికే పరిమితం కాకుండా వ్యాపార,రాజకీయ,సేవా కార్యక్రమాలు వంటి వాటిలో రాణిస్తూ ఆదర్శంగా నిలవాలని ఇండియన్ మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జీవీఎల్ పద్మ అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శనివారం విద్యార్థినులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ అంటే శక్తి ,అంతటి శక్తి వంతమైన మహిళ వంట ఇంటికే పరిమితం కాకూడదన్నారు.ఉన్నత విద్యవంతురాలై సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి నాయకులు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఎన్‌డీఏ కూటమిలో ఉన్న పార్టీల నాయకులు కేంద్ర ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి పెంచాలని విశాఖ ఉక్కు కార్మిక సంఘాల నాయకులు ప్రగడ వేణుబాబు, ఎం.వి.రమణ, ఎన్నేటి రమణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 1227వ రోజు, శనివారం టీపీపీ, పీఈఎం, రెడ్, స్టోర్స్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ పక్క కేంద్ర ఉక్కు సహాయ మంత్రి కిషన్‌రెడ్డి ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో ఆందోళన చెందొద్దని చెబుతున్నా మరోపక్క ఉక్కు ఆస్తుల అమ్మకానికి సిద్ధం కావడం రాష్ట్ర ప్రజలను, ఉక్కు ఉద్యోగులను, నిర్వాసితులను ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఉక్కు పరిరక్షణ విషయంలో కూటమి నాయకులు చొరవ చూపాలని కోరారు.

వ్యాధుల వివరాల నమోదు తప్పనిసరి

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూలకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి జిల్లా మలేరియా అధికారిని సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం అనంతరం జిల్లాలో 'స్టాప్ డయేరియా'ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. ఐఆర్‌ఏడీ యాప్ అప్‌లోడ్ గురించి తెలిపారు. అంతే కాకుండా పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్, ఫారం-ఎఫ్ అప్‌లోడింగ్, రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ తదితర వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని ఆస్పత్రులు రెన్యువల్స్, రిజిస్ట్రేషన్స్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఫారం-ఎఫ్ ఆన్‌లైన్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా సాధారణ కాన్పులు చేయాలని, సాధ్యమైనంత వరకు సి-సెక్షన్ ప్రసవాలు తగ్గించాలని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తులసీరాజ్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వ్యాధులకు సంబంధించిన రిపోర్టులు తెలియజేసేటప్పుడు రోగుల ఆధార్ కార్డు, ఇతర వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. దాని వలన రోగిని సులభంగా గుర్తించి మెరుగైన వైద్య సేవలందించడానికి వీలు కలుగుతుందన్నారు.

సర్కారు పాఠశాలల్లో ప్రవేశాలకు క్యూ



శ్రద్ధగా పాఠాలు వింటున్న విద్యార్థులు

- గోపాలపట్నం బాలికల పాఠశాలలో 180 మంది
- ఉన్నత పాఠశాలలో 150 మంది చేరిక
- సౌకర్యాల కల్పన, ఫలితాల మెరుగుతో డిమాండ్



గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల

గోపాలపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలకు విద్యార్థుల క్యూ కడుతున్నారు. పాఠశాలల్లో వసతులతో పాటు బోధన పద్ధతులు మారడంతో చేరికలకు ఆసక్తి చూపుతున్నారు. సబ్జెక్టు టీచర్ల నియామకం.. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. ఫలితంగా ఆ పాఠశాలల్లో చేరడానికి విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. దీనికి నిదర్శనంగా గోపాలపట్నంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రవేశాలను చెప్పవచ్చు.

పెరుగుతున్న అడ్మిషన్లు

గోపాలపట్నం జిల్లా పరిషత్‌బాలికల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6 నుంచి 10 తరగతుల్లో ఇప్పటి వరకు 180 విద్యార్థులు చేరారు. అలాగే గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులు చేరారు. ఒక్క ఆరో తరగతిలోనే 111 మంది చేరారు.

- యల్లపువానిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 6 నుంచి 10 తరగతుల్లో 57 మంది చేరారు.
- కొత్తపాలెంలో 6 నుంచి10 తరగతుల్లో 58 చేరారు.
- హెచ్‌సీ వెంకటాపురం జెడ్పీ స్కూల్ లో 6 నుంచి10 తరగతుల్లో 65 మంది ప్రవేశాలు పొందారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

మెరుగు పడిన పాఠశాల విద్య

ప్రభుత్వలో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగు పడ్డాయి. విద్యార్థులకు సులువుగా ర్థమయ్యే విధంగా ఐఎఫ్‌టీ ప్యానళ్ల ద్వారా విద్యా బోధన చేశారు. ప్రధానంగా సైన్స్, సోషల్ గణితం పాఠ్యాంశాలు విజువలైజ్డ్‌గా బోధించడంతో పాటు సాంకేతిక సాధనాల ద్వారా ఉపాధ్యాయులు నిరంతరం మోనటరింగ్ చేయడంతో విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు రాబట్టారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. మధ్యాహ్నం భోజనం మెరుగు పడింది. సౌకర్యాలతో పాటు విద్యా ప్రమాణాలు బాగుండడంతో ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెంచింది.

ప్లస్ 2పై ప్రత్యేక శ్రద్ధ



గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్లస్ 2 మొదలై రెండేళ్ల పూర్తయింది. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ఎంసెట్, జేఈఈలకు కూడా తర్ఫీదు ఇస్తాం. ప్లస్ 2 విద్యార్థులకు కూడా ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నం భోజనం ఈ ఏడాది నుంచి అమలవుతుంది. - కేవీవీఎస్‌డీ ప్రసాద్, ఇన్‌చార్జి హెచ్‌ఎం

జోరుగా అభివృద్ధి పనులు



రూ. 15 లక్షలతో నిర్మిస్తున్న సీసీ మెట్ల మార్గం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నెహ్రూనగర్ కొండ వాలు ప్రాంత వాసుల సమస్యలకు మోక్షం లభిస్తోంది. ఈ ప్రాంతంలో సీసీ మెట్లు,సీసీ కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొండ ప్రాంతం కావడంతో కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే వారు కాదు. దీంతో వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ జీవీఎంసీ వర్క్స్ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎలాగైనా కొండ వాలు ప్రాంతంలో అభివృద్ధి పనులను చేపట్టాలని పట్టుబట్టారు. దీంతో నెహ్రూనగర్ కొండ ప్రాంతంలో సుమారు రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, రూ.5 లక్షలతో సీసీ కాలువ పనులను చేపడుతున్నారు. అభివృద్ధి పనులను ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, రేవళ్ల సత్యనారాయణ శనివారం అభివృద్ధి పనులను పరిశీలించారు.

రైతు బజారులో పార్కింగ్ నిర్వహణకు టెండర్లు

గోపాలపట్నం: గోపాలపట్నం, కంచరపాలెం రైతు బజార్లలో వాహనాల పార్కింగ్ నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఆసక్తిగల వారు రూ10000 ధరావత్తు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంయుక్త కలెక్టర్ రైతు బజార్లు, విశాఖ పట్నం పేరున తీసిన డీడీ జత చేసి దరఖాస్తును జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్ నంబర్-8-202/2, ఆర్ఆర్‌వీ పురం, గోపాలపట్నంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 28 మధ్యాహ్నం 1గంట లోగా దరఖాస్తులు చేయాలని తెలిపారు. 28న సాయంత్రం 4 గంటలకు టెండర్ తెరచి కలెక్టర్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కంచరపాలెం రైతు బజారులో పార్కింగ్ ధర రూ.47,250, గోపాలపట్నం రైతుబజారులో రూ. 77,164 ప్రభుత్వ ధర ఉంటుందని తెలిపారు. సైకిల్‌కి రూ.2, ద్విచక్రవాహనానికి రూ.5, ఆటోకు. 10, కారుకు రూ.20 వసూలు చేయాలి. గుర్తింపు పొందిన రైతుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేయరాదని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 9030819082 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

కేవీ నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

బోధనతో పాటు పలు అంశాలపై అవగాహన



ప్రార్థన గీతం ఆలపిస్తున్న విద్యార్థులు



శిక్షణ తరగతులకు హాజరైన నూతన ఉపాధ్యాయులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం శ్రీవిజయనగర్‌లోని కేంద్రీయ విద్యాలయం-2లో సంఘటన్ ద్వారా నూతనంగా ఎంపికైన హైదరాబాద్ రీజియన్‌కు చెందిన ఉమ్మడి జిల్లాలోని వివిధ కేంద్రీయ విద్యాలయాల్లో నియమితులైన నూతన ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఈస్టన్ నేవల్ కమాండ్, విద్యాలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ కమాండర్ రజత్ నాగ్‌పాల్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. విద్యాలయ సంఘటన్ మిషన్, ఆశయాలు, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అనుసరణ, నిపుణ్ భారత్, నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్ వర్క్, పాఠశాలలో ఉపాధ్యాయుల ప్రవర్తనా నియమావళి, సమగ్ర విద్యా పరిపాలన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ 26వ వరకు శిక్షణ ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కేవీ-1 ప్రిన్సిపాల్ మదీనా మాలిక్, సాహిత్య, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

తాళం పడుతుంది జాగ్రత్త

రాంగ్ పార్కింగ్‌పై ట్రాఫిక్ అధికారుల కఠిన చర్యలు



బాజీ జంక్షన్ వద్ద రాంగ్ పార్కింగ్ చేసిన కారు చక్రాలకు తాళం వేసిన ట్రాఫిక్ పోలీసులు

గోపాలపట్నం: ప్రధాన రహదారులపై అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేసేవారు ఇక నుంచి జాగ్రత్త పడాల్సిందే. ట్రాఫిక్ అధికారులు కాళ్లకు బందాలు వేస్తున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే క్రమంలో ప్రధాన రహదారులపై రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలపై కఠిన చర్యలు చేపట్టారు. గోపాలపట్నం నుంచి ఎన్‌ఏడీ వరకు ప్రధాన రహదారులపై రాంగ్ పార్కిగ్ చేసిన వాహనాల చక్రాలకు తాళాలు వేస్తున్నారు. వాటి ఫోటోలు తీసి పోలీస్ యాప్‌లో అప్‌లోడ్ చేసి ఫైన్లు వేస్తున్నారు. శనివారం బాజీ జంక్షన్ వద్ద కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు పలు కార్లతో పాటు ద్విచక్రవాహనాలకు తాళాలు వేశారు. ఆయా వాహనాలకు ఫైన్లు వేశారు.

సంపత్ వేంకటేశ్వరుడికి పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో వెంకన్న

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ, అర్చకులు శర్మ నేతృత్వంలో వెంకన్నకు సుప్రభాత సేవ, చక్రస్నానం చేశారు. వేకువ జాము 6 గంటలకు శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, కమిటీ సభ్యులు పంచామృతాభిషేకాలు, తులసీ మాలార్చన, కుంకుమ పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం



గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ ఉపేంద్ర

గోపాలపట్నం: మాదక ద్రవ్యాలను దరి చేరితే అనర్థమేనని గోపాలపట్నం ఎక్సైజ్ ఎస్‌ఐ ఎల్. ఉపేంద్ర అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో శనివారం మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి, హెరాయిన్, కొకైన్, మద్యం వంటివి అలవాటు చేస్తున్నారన్నారు. వాటి జోలికి వెళ్లి జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఇవి ఆరోగ్యాన్ని పాడు చేయడమే కాకుండా మానసికంగా కుంగి పోతారన్నారు. మాదక ద్రవ్యాలు రవాణా చేయడం, అమ్మడం వాడడం నేరం అన్నారు. ఇలాంటి వారు ఎక్కడైనా కనిపిస్తే 14500 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను గుర్తిద్దాం

- సమన్వయంతో శతశాతం అక్షరాస్యత సాధిద్దాం
- పెదగంట్యాడ ఎంఈవో శ్రీనివాసరావు



బడికి పోదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

గాజువాక : బడిఈడు పిల్లలను గుర్తించే బాధ్యతను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు తీసుకోవాలని విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారి ఇ.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం లక్షల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. బడిఈడు పిల్లల్ని అన్ని శాఖల అధికారులు గుర్తించాలని, శత శాతం అక్షరాస్యతను సాధించడానికి కృషి చేయాలని కోరారు. ఈ నెల 13న ప్రారంభమైన ఈ కార్యక్రమం వచ్చేనెల 13 వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో లేబర్ ఐసీడీఎస్, లేబర్ డిపార్టుమెంట్ ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. చిన్నారులను గుర్తించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. బడి మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ బడిలో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లకు పైబడ్డ చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం స్టూడెంట్ కిట్లు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో గాజువాక, పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు విశ్వనాథం, సునీత, కె.రమణాజీ, ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్టు అధికారి నీలిమ, లేబర్ డిప్టార్‌మెంట్ అధికారి నరేష్, జీవీఎంసీ సూపరింటెండెంట్ ఈశ్వరి పాల్గొన్నారు.

కార్మిక హక్కుల రక్షణకు నిరంతర పోరాటం

- సీఐటీయూ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు
- కార్మికులకు శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న జగ్గునాయుడు

ఉక్కునగరం: కార్మిక హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత వేగవంతంగా కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేస్తోందని, అందులో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా ప్రైవేటుపరం చేసేందుకు పూనుకుంటోందన్నారు. ప్లాంట్‌ను ఆర్థికంగా ఆదుకోవాల్సింది పోయి ప్లాంట్ ఆస్తులను అమ్మకానికి పెట్టడం దుర్మార్గమన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావు ప్రిన్సిపాల్‌గా, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. తరగతులకు స్టీల్‌ప్లాంట్, బీహెచ్‌ఈఎల్, హెచ్‌ఎస్‌ఎల్, హెచ్‌పీసీఎల్, పోర్టు ట్రస్ట్, మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

వరాహ పుష్కరిణి వద్ద పోలీసుల నిఘా



వరాహ పుష్కరిణి వద్ద పరిశీలన చేస్తున్న సీఐ సురేష్ తదితరులు

సింహాచలం: గంజాయి, డ్రగ్స్ సరఫరాతో పాటు వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా శనివారం రాత్రి గోపాలపట్నం పోలీసులు సింహాచలంలోని వరాహ పుష్కరిణి తదితర ఏరియాల్లో తనిఖీలు నిర్వహించారు. గోపాలపట్నం సీఐ సురేష్, ఎస్‌ఐ అప్పలనాయుడు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో జీఎం తనిఖీలు



కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ కేకే(కొత్తవలస-కోరాపుట్) లైన్‌లో శనివారం ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్ తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణా సామర్థ్యం, ప్రయాణికుల సదుపాయాలతోపాటు రెండో లైన్ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా రైల్ వినియోగదారులు, భాగస్వాములైన ఎన్‌ఎండీసీ వంటి కంపెనీల ప్రతినిధులతో సమావేశమై రైల్వే అభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకోవాలని, దీని ద్వారా ఇరువర్గాలు లబ్ధి పొందుతాయని జీఎం సూచించారు. ఈ మార్గంలో గల కోరాపుట్, అరకు, శివలింగపురం స్టేషన్లలో పర్యటించి, అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విండో ట్రయలింగ్ ద్వారా నిర్మాణంలో ఉన్న డబ్లింగ్ లైన్, గుహలు, మలుపులు, క్రాసింగ్స్, పాయింట్స్, వంతెనలను కూడా తనిఖీ చేశారు. పర్యటనలో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, చీఫ్ ఫ్రైట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ దిబ్యంజన్ రాయ్, ఇతర ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



కలశ స్నపనం చేస్తున్న అర్చకులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. వారం రోజుల పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు శనివారం ఉదయం ఆరు గంటల ఉంచి ఆరాధన, పారాయణం , నిత్య హోమం, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణ, నవకలశ పూజ, చక్రస్నానం జరిపించారు. సాయంత్రం విష్వక్సేన పూజ, పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. ఆలయ ధర్మకర్త ఇ.కె. చారి దంపతులు, కమిటీ ప్రతినిధులు సాయిబు నాయుడు, నరసింగరావు, గురనాథరావు, కృష్ణారావు, సత్యనారాయణ, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సోమశేఖర్, గొల్లవిల్లి వెంకటరావు పాల్గొన్నారు.

దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెదగంట్యాడ: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హార్బర్ క్రైం సీఐ జి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అయ్యన్నపాలెం పార్కులో క్రీడాకారులు, వాకర్లతో శనివారం ఆయన మాట్లాడారు. మీ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. ఎవరైనా ఇళ్లకు తాళం వేసి, ఊళ్లకు వెళ్తే సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే, ఆయా ఇళ్ల వద్ద నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఎఆభరణాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని, చైన్ స్నాచర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

జల సంరక్షణకు శ్రీకారం



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వరప్రసాద్

మురళీనగర్: నగరంలో భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్(ఏపీ ఫెర్వాస్) అధ్యక్షుడు ఉదయ్ షిర్‌నామే తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టారు. మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఇంకుడు గుంత నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా షిర్‌నామే మాట్లాడుతూ నగరంలోని అన్ని పార్కుల్లోనూ ఇంకుడు గుంతల నిర్మాణానికి అయ్యే ఖర్చు తమ సంఘం భరిస్తుందని తెలిపారు. కాంక్రీట్ జంగిల్ పెరుగుతున్న నేపథ్యంలో ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా జల సంరక్షణకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని సనపల వరప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్.ఆర్.మూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, జోన్-5 కో ఆర్డినేటర్ కర్రి శేషగిరిరావు, వనితా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి పాల్గొన్నారు.